వేంకటరామయ్య, పంచవటి

దమయంతీ చరిత్రము : పాతివ్రత్య ప్రభావము

చెన్నపట్టణము, 1911

Record no. 307

Vēṅkaṭarāmayya, Pañcavaṭi

Damayantī caritramu : Pātivratya prabhāvamu

Cennapaṭṭaṇamu, 1911

Record no. 307

Bibliographic Record Target

వేంకటరామయ్య, పంచవటి.

దమయంతీ చరిత్రము : పాతివ్రత్య ప్రభావము / పంచవటి వేంకటరామయ్యచే విరచితము.- చెన్నపట్టణము : స్మార్ టన్ ముద్రాక్షరశాల, 1911.

23, (1) p. ;18 cm.

Record no. 307

Vēṅkaṭarāmayya, Pañcavaṭi.

Damayantī caritramu : Pātivratya prabhāvamu / Pañcavaṭi Vēṅkaṭarāmayyacē viracitamu.- Cennapaṭṭaṇamu : Smār ṭan Mudrākṣaraśāla, 1911.

23, (1) p. ;18 cm.

Record no. 307

THE POPULAR ANNA LIBRARY

CHILDREN'S
INSTRUCTIVE
MORAL TALES.

DAMAYANTI.

PANCHAVATI
VENKATARAMIAH.

శ్రీరస్తు

దమయంతీ చరిత్రము.

(పాతివ్రత్య ప్రభావము.)

హిందూథియలాజికల్ హైస్కూలు

ఉపాధ్యాయులును

అభినయగీతాది గ్రంథకర్తయు

నగు

పంచవటి - వేంకటరామయ్యచే

విరచితము.

స్కాటన్ ముద్రాక్షరశాలయందు ముద్రితము.

చెన్నపట్టణము.

1911

 [వెల అణా 1.

శ్రీ

దమయంతీ చరిత్రము.

విదర్భదేశమును భీముడను రాజు రాజ్య పరిపాలనము సేయుచుండెను. అతడు సమస్త భోగభాగ్యములచేత గూడి యుండినను బిడ్డలు లేనందున మిక్కిలి వ్యసనము గలవాడై భార్యతో గూడి యడవికిబోయి తపస్సుచేయగోరెను. అచట దమనుడను మునీంద్రునిగని యతనియనుగ్రహముచేత దమయంతియనుపుత్రికను, దముడు, దాంతుడు, దమనుడు, అను మువ్వురు పుత్రులను బడసెను. వారిలో దమయంతియను కన్యారత్నము రత్నమువలె ప్రకాశించుచు సర్వగుణ సంపదచే నొప్పియుండెను. ఈచిన్నది తన చెలికత్తెలతో నొకనాడు శృంగారవనమునకు బోయి వినోదార్థముగా నాటపాటలతో సంతోషంబున కాలము గడపుచుండ కొన్ని రాజహంసలు ఆకసమునుండి క్రిందికి వ్రాలినవి. వానింగని యొక్కొక్క చెలికత్తెయును దానును నొక్కొక్క హంసను బట్టుకొనిరి. ఆపక్షులలో నొక్కటి మనోజ్ఞమైన మనుష్యవాక్యములతో దమయంతినిజూచి ,,అమ్మా! మేమొక కార్యమును ఉద్దేశించి వచ్చియున్నాము. అదియేమనగా నిషధదేశమునందు వీరసేన మహారాజు కొమారుడైన నలుడనువాడు రాజ్యమేలుచున్నాడు. అతడు మహాకీర్తినంతుడు, సౌందర్యవంతుడు, భాగ్యవంతుడు. సర్వగుణసంపన్నుడు, అతని వర్ణించి చెప్ప నెవరి

వల్లను తరముకాదు. కావున నీవు ఆయనను వివాహంబాడిన మిక్కిలి శ్రేయస్కరముగా నుండును. నీయొక్క మంచిగుణములకు, సద్వర్తనలకు, రూపయౌవన సౌందర్యములకు, ఆయనయే తగిన పురుషుడు. ఆయనతప్ప వేఱొక పురుషుని నేనెందును జూడలేను" అని చెప్పగా దమయంతి తనలోదాను చిఱునవ్వు నవ్వుకొనుచు కొంతసేపు సిగ్గుచే నూరకుండి తర్వాత దానితో నిట్లనియె. "ఓపక్షిశ్రేష్ఠమా! ఆరాజుగుణములు నాకు నెఱింగించినట్లుగా నన్ను నారాజునకెఱింగించి నామీద కరుణగలిగియుండునట్లుగా జేయు" మన హంసలన్నియు గుంపుగూడి నిషధదేశమునకు వచ్చి నలునికి దమయంతిరూపలావణ్యములను వర్ణించి చెప్పి యామెయందే ప్రేమకలిగి యుండునట్లుగా జేసినవి. ఈ వృత్తాంతము భీమరాజు దమయంతి చెలికత్తెలచే విన్నవాడై యుక్తవయస్సువచ్చిన తన కొమార్తెకు స్వయంవరమహోత్సవము చాటించి భూలోకంబునం గల యెల్లరాజులకు పత్రికలు వ్రాసిపంపగా వారలు నిషధదేశమునకు జనుదెంచిరి.

అత్తఱి త్రిలోకసంచారియగు నారదమహాముని యీ విషయంబెఱింగి దేవేంద్రలోకమునకు బోయి యింద్రాదులతో దమయంతీ స్వయంవరవైభవమును గూర్చి చెప్పెను.

క. నరసిద్ధసాధ్యవిద్యా
ధరసురకన్యకలకంటె దమయంతియ సుం

దరి దాని సుస్వయంవర
మరుదై వర్తిల్లుచున్న యది యిప్డుమహిన్.
క. అందులకు ధరణిగల నృప
నందనులెల్లను ముదంబునంబోయెదు వే
డ్కందమలోగయ్యమ్ములు
గ్రందుగ లేకున్నవారు కడునెయ్యమునన్.

అదివినగా నింద్రాదిదేవతలు భూలోకంబునకువచ్చుటకై యొకరమ్యవిమానంబుపై నెక్కి యాస్వయంవరమునకే వచ్చుచున్న నలుని గని "ఓనలమహారాజా! ఇప్పుడు నీవు మాకు దూతగానుండి దమయంతికి మారాకనుగూర్చి యెఱుగజేసి మాలో నెవరినైనను వరించి వివాహము చేసుకొనునట్లుచేయవలయు" నని వేడుకొనిరి. అంతనలుడు దేవేంద్రాదులను జూచి "ఓసురవరులారా! నేనును దమయంతీస్వయంవరముకొఱకు వచ్చియున్నవాడను. నన్ను మీరికార్యంబునకు బంపుట న్యాయమగునా?" అనిచెప్పి తనమనస్సులో "అన్యథా చింతితంకార్యం, దైవం అన్యత్రచింతయేత్" అనితలచుకొనుచు, అయినను నిది దేవహితము గావున దీనిని నెఱవేర్పవలయును. అడ్డము చెప్పతగదు" అని మరల చింతించుచు వారి యిష్టప్రకారము విదర్భకేగి దమయంతికి వారిరాకయును వారియుద్దేశమును దెల్పెను.

దమయంతి దీనిని వినినతోడనే మనస్సునందు మిక్కిలివ్యసనముగలిగినదై నలునిజూచి "ఓరాజా! హంసచే నీవ్వ

వృత్తాంతమును అంతయువిని సంతసించితిని. నాటనుండి నామనస్సు నీమీదనే నిల్పియున్నాను. నిన్నే వివాహంబాడ దలచియున్న దానను. కాన నన్యుల నొల్లను. ఒక పురుషుని మనస్సున నిశ్చయించినతర్వాత యితరుల నపేక్షించుట పతివ్రతాధర్మంబుగాదుగదా. నీవు దీనికంగీకరించనినాడు నాదు ప్రాణంబుల విడిచిపెట్టెదనని" చెప్పెను.

నలుం డదివిని "దమయంతీ! దేవతలమనస్సు నొప్పింపరాదు. వారికి ప్రియముకానిపనియు చేయరాదు. సహవారిని మెప్పించి మనకార్యంబుల చక్కపెట్టుకొన

మఱియు మత్తకోకిల.

ఘోరిసత్వులు సర్వలోకవిభుల్ విభూతిసమృద్ధులి
ద్ధోరుకీర్తులు నిన్నుగోరుచు నున్నవా రమరోత్తముల్
వారిపాద రజంబుబోలని వానినన్ను మనుష్యు సం
సారిగోరగ జన్నెనీకు ప్రసన్నులై సురలుంక

వారు మిక్కిలి బలముగలిగియున్న వారు, లోకములకు ప్రభువులు, గొప్పయశస్సుగలవారు, దేవతలలో శ్రేష్ఠులు. నేనో వారిపాదధూళికికూడ సమానముకానివాడను. కాబట్టి నీవు వారిలో నొకరిని పెండ్లియాడుట యుక్తమని చెప్పెను.

అట్లుచెప్పగా నామె మరల చింతాక్రాంతయై కొంతకాలంబుచింతించి నలునితో నిట్లనియె. "ఇంద్రాదులు నా

స్వయంవరమునకు వచ్చియున్నారుగదా! వారి యనుమతిని బొంది క్షత్రియస్త్రీలు స్వయంవరములో వరుని ఎట్లు వరింతురో యాలాగున అందఱు చూచుచుండగా వారి సమ్ముఖమున నిన్ను వరించెద" అని చెప్పియంపి స్వయంవరకాలమునందు వచ్చియుండు రాజులందఱు చూచుచుండగాతనచేతనున్న పుష్పమాలికను నలునిమెడపై వేసెను. అట్లు వేయగా

క. దేవతల సాధువాదము
తో విప్రాశీరవంబుతో బహుతూర్యా
రావంబులు చెలగెను బా
రావార రవంబుబోలె ననివార్యంబై.

అంత వివాహంబైన యాదంపతులను నింద్రుడు మొదలైన దేవతలు మెచ్చి వారిని నాశీర్వదించి పిమ్మట దేవలోకంబునకుం బోవుచుండగా కలి పురుషుడు వారికి నెదురుగా వచ్చుచు దమయంతికి వివాహమైన సంగతి వారిచే తెలుసుకొన్నవాడై తన్ను నామె వివాహంబాడలేదని కోపించి నోటిపండ్లు పటపట యని కొఱుకుచు కండ్లు ఎఱ్ఱగాజేసికొనుచు నలుని దాయాదియైన పుష్కరునియొద్దకుబోయి యాతనిని నలునితో జూదమాడుమని ప్రేరేపించి తాను నొక బ్రాహ్మణవేషము ధరించి పందెములను కపట కృత్యములచేత పుష్కరునికి అనుకూలముగజేయుచు నలుని యావద్ద్రవ్యమును రాజ్యమును ఓడునట్లు చేసెను.

ఆసమయమున దమయంతి [redacted]పెనిమిటి యపజయము గనుగొని ఆయన యనుమతింగొని యింద్రసేనుడను కొమారుని నింద్రసేనయను కొమార్తెను నొక్క తేరుపైనిడి వార్ష్ణేయుడను సారధికి నొప్పగించి విదర్భానగరంబున తన తల్లిదండ్రుల యొద్దకు బంపెను.

ఇవ్విధంబున నలుడు కలిమాహాత్మ్యముచేత సర్వసంపదలును రాజ్యంబును జూదమాడి వారపోసుకొనియూరువదలి భార్యతో దానును ఎల్లజనులు చూచుచుండ "అవశ్యమను భోక్తవ్యం కృతంకర్మశుభాశుభం" అనునట్లు [redacted] నకుబోయెను.అక్కడవారిరువురు మూడు దినములుగా అన్నాహారములు లేనందుచేత మిక్కిలి యాకలివలన పీడింపబడినవారై ఇటునటు అల్లాడుచుండగా బంగారు రెక్కలచేత నొప్పునట్టి రెండుపక్షులు వారి సమీపమునకు వచ్చెను. అప్పుడు నలుడు వానిని బట్టుకొనుటకై తనకట్టుబట్టను వే[redacted] తక్షణమే యవి యావస్త్రముతోగూడ ఆకాశమునక[redacted]యెను. 'అయిరాని కాలానికి పైబట్టను పక్షులెత్తుకొనిపోయె' అను సామెతవలె వీరికిట్టి దశ సంభవించెను.

పిమ్మట నలుడు పతివ్రతాశిరోమణియగు తన భార్యగట్టిన చీరలో సగముచించి తనకుపైబట్టగా జేసికొని దుఃఖముతో తన్ను నంటి నడచి వచ్చుచున్న దమయంతిని జూచి "ఓయిందుముఖీ! నీవేల యీ యడవిలో నాతో కష్టపడు

చున్నావు? నీతండ్రియింటికిపోయి నీవైనను సుఖముగా నుండరాదా"? అని చెప్పెను. అప్పుడు ఆమె పట్టరాని దుఃఖముతో గొంతెత్తి బిగ్గరగా నేడ్చుచు మరల కొంతనుట్టుకు ధైర్యము తెచ్చుకొని కన్నీటిని దుడుచుకొనుచు నలునితో నిట్లనియె. "నాథా! తమకు తెలియని ధర్మంబులేదు. అయినను నామాట తప్పైనను ఒప్పైనను కొంచెము వినుడు.

తే. అఖిలదుఃఖ రోగార్తున కౌషధంబు
సుచుచిరంబుగ భార్యయ చూవె యెందు
నొనరభార్యాసమేతుడై యున్నవాని
కెన్నియాపదలున్నను నెఱుకపడవు.

క. అలయునెడ డయ్యునెడ నా
కలియు దృషయు నైనయెడల గనుగొని ధరణీ
తలనాథపురుషునకు ని
మ్ముల భార్యయ పాచు జిత్తమున దుఃఖంబుల్.

అదియునుంగాక 'భార్యాసమోనాస్తి శరీరతోషణ" [redacted] వచనమువలె శరీరమునకు సంతోషము గల్గించుట [redacted]ందు భార్యతో సమానమైనవారు ఎవరు లేరు.

చ. పతిగడవంగదైవతము భామలకెందును లేదు ప్రీతుడై
పతికరుణించెనేని కలభాషిణి భాసురభూషణాంబరా
న్వితధనధాన్యగౌరవము విశ్రుతసంతతియున్ యశంబుస
ద్గతియునుగల్గు నొందుమెయి గల్గినె యిన్ని తెఱంగులార
[యున్.

గీ. కరముదుఃఖపడిన గానియొక్కింత సౌ
ఖ్యంబు ధర్మగతియు గలుగదెందు
జూడ నబల భర్తృ శుశ్రూషఫలము సం
తతసుఖంబు గలదు ధర్మవాదవు.

క. ధని యధనుడుదూపసి యొ
ప్పనివా డవివేకి మూఢభావు డరోగుం
డనుగతరోగుడనక యం
గన పతి బాటింపవలయు గల కాలంబుం

స్త్రీలకు పతియేదైవము, పతియేనోము, పతియే తీర్థంబులు, పతియే సమస్తధర్మంబులు మఱియు ధనముగలవాడు, ధనములేనివాడు, అందగాడు, అందములేనివాడు, తెలివిగలవాడు, తెలివిలేనివాడు,రోగములేనివాడు, రోగి, అను భేదములేక యాడుది మగనిని సదా అనుసరించియాదరింపవలయును. ఆతనికి సంభవించు సుఖదుఃఖములను తానును ననుభవించవలయును. అట్టి యాడుదియే కులాంగన, పతివ్రత, యనబడును. కావున నిన్ను విడిచిన స్వర్గంబైన నాకు సౌఖ్యంబుకానేరదు. దేహముతోడ నీడ యున్నట్లు నీతోడనుండి యెట్టి కష్టములు వచ్చినను వానిని సుఖములుగా భావింతును. నిన్నువదలి యెట్టి సుఖములుకలిగినను కష్టములుగా తలతును. కాబట్టి నిన్ను ఎన్నడును వీడను" అని చెప్పగా వారిరువురు ఒకటిగా చేరి నడచి నడచి మార్గశ్రమచేత నడవలేక యొకచావడి కనబడగా నందు పండుకొని నిద్రించిరి.

పిమ్మట నలుడు నిద్రపట్టకున్నందున లేచి తనకు సంభవించిన కష్టమును తలచుకొని దుఃఖించి నిద్రించుచున్న దమయంతి నిజూచి ఆహా! నన్ను కట్టుకొన్నందువలనగదా యీమె యిట్టి యిడుమల పాలైనది. నేను ఏమిపాపము చేసితి. ఇక దీని దుఃఖంబు జూచుట మహాపాపము. ఎటకేనియుంబోయెద" అని తిన్నగాలేచి సగము బట్టను చించి కట్టుకొని అరణ్యమార్గముగా వెళ్లిపోయెను. అంత దమయంతి మేలుకొని నాలుగుప్రక్కల వెదకిచూచి ప్రాణేశ్వరుని గానక దుఃఖించుచు పొదలయందుదూఱి చూచుచు ముండ్లుతాళ్లలో పడి లేచుచు క్రూరమృగంబుల కూతలకు ఉలికిపడుచు హా నాథా! నన్నిట్లు విడిచిపెట్టిపోవ నీకు న్యాయమగునా? నేను నీయెడల ఏమి నేరముచేసితి? నాభాగ్యంబిట్లాయెనా? దైవమా? అని కూతవేయుచు భయంకరమైన యడవియందు నడచిపోవుచునుండ [illegible]వాడు బుద్ధిలేనివాడై యామె నపేక్షించెను. దమయంతి కోపించి వానిని శపింపగా వాడు తోడనె యామె పాతివ్రత్యమహిమచే చచ్చెను. అంత నామె యచ్చటినుండి వెడలిపోవుచు నొకయాశ్రమమున తపస్సు చేయుచున్న ఋషులను గని నమస్కరించి తన్నెఱుగజెప్పి దుఃఖింపగా వారు కరుణించి యమ్మా! నీపురుషుని కొన్ని దినంబులలోపల జూడగలదానవు నీకునేకొఱతయు గలుగదు. అని చెప్పి యాశీర్వదించి యదృశ్యులైరి.

తర్వాత దమయంతి యెటుబోవుటకును దోచక యోచించుచుండ గొందఱు వర్తకులు చేదిపురంబునకు ఆమార్గంబుగా బోవుచుండిరి. వారిని తోడుగా నిడుకొని యామెయు చేదిపతియైన సుబాహుపురంబునకు బోయి యచట రాజమాతయొద్ద సైరంధ్రీవ్రతమున్న కాలము గడపుచు వచ్చెను. అట నలుండు దమయంతిని వదలి యరణ్యమున బోవుచుండగా అగ్ని జ్వాలలనడుమ జిక్కుకొని నన్ను కాపాడుము, నన్ను కాపాడుము అని మొఱబెట్టుచున్న కర్కోటకుడను నొక నాగుబామును చూచెను. అప్డు దాని యవస్థను జూడలేక నలుడు దానిని బైటికీడ్చెను. అదియు గాపాడబడిన పిదప వానిని గఱచెను. ఆక్షణంబున నలుడు వికృతరూపుడయ్యె. కర్కోటకుండు ఆనలుంజూచి ,, ఓ రాజోత్తమా! నీవు నాచే కఱవబడినందుకు చింతపడవలదు. నిన్ను నితరులు ఎఱుగకుండుటకై యిట్లు చేసితిని. నాయొక్క విషము నీదేహంబుననున్నంతకాలము నీకు విష రాక్షస పిశాచ శత్రుభయంబు లేదు. నీకు ఎప్పటివలె రాజ్యవిభవము కలుగును. నీకు ఎప్పుడు నిజరూపము గైకున నిష్టముగలదో అప్పుడు నన్ను దలచిన నీవస్త్రంబు నీకు లభించుటయేగాక నీ నిజరూపమును ప్రాప్తియగును.'' అని చెప్పి మఱియు నిట్లనియె

సైరంధ్రి :—పతివ్రతాధర్మమును కాపాడుకొనుచు రాజగృహంబున పనిచేయుచున్నట్టి యాడుది.

అయోధ్యాపట్టణము నేలుచున్న ఋతుపర్ణ మహారాజు నకు బాహుకుండను పేరుతో సారథియై యుండుము. నీవతనికి అశ్వహృదయ మనువిద్యనిచ్చి యతనిచేత అక్షహృదయంబనువిద్య జేకొనుము'' ని చెప్పి కనబడకపోయెను. అంత నానలుడు కర్కోటకుడు చెప్పినప్రకారము అయోధ్యకేగిఋతుపర్ణునెడ బాహుకుండను నామమ్ముతో అశ్వములను బాలించువాడుగాను, అన్నసంస్కారంబులు సేయువాడుగాను నుండెను.

అయ్యెడ భీమరాజు తనకూతురు, అల్లుడును రాజ్యనాశంబొంది యక్కడక్కడ తిరుగుచు కష్టపడుచున్నారని చారులవలన విని మిక్కిలిదుఃఖించి అతి సమర్థులైన బ్రాహ్మణోత్తముల రప్పించి వారల నానాదేశంబుల వెదక నియోగించి వారున్న చోటు కనవచ్చినవారికి వేయిగద్యాణములును, వారల దోడ్కొనివచ్చువారికి వేయి ఆవులనిత్తునని చెప్పిపంపెను. అట్లు వెదకబోయినవారిలో సుదేవుడను బ్రాహ్మణుడుమాత్రము చేదిపురంబగు సుబాహు పట్టణమునకుబోయి సునందయను రాజకన్యకతో గూడియున్న యద్దమయంతిని సూక్ష్మలక్షణములచేత నీమె భీమరాజుకూతురుగ నుండవచ్చునని నిశ్చయించి యామెనుజూచి, ,, అమ్మా! నేను విదర్భాపురమునుండి వచ్చినవాడను నాపేరు సుదేవుడు. భీమరాజు మీయిద్దరిని వెదుకుటకు ననేక బ్రాహ్మణులబంపెను. నాపుణ్యావశముచేత నిను జూచునట్టిభాగ్యము నాకు కలిగినది. నీవృత్తాంతమును దెలియ

జేసినయెడల నీతండ్రికి నెఱింగించెదను" అని చెప్పగా నక్కోమలి కన్నీరు చోటచోటం గార వెక్కివెక్కి యేడ్చుచు నచటివారి క్షేమం బడుగుచుండ సునంద యీ వృత్తాంతమును రాజమాతకు నెఱింగించెను. అంతరాజమాత సుదేవునొద్దకువచ్చి యాతనివలన దమయంతి తనతోడబుట్టువు కూతురని యెఱిగినదై యామెను మునుపటికంటె మిక్కిలి ప్రేమతో నాదరించుచువచ్చెను.

కొన్నాళ్లయినపిదప దమయంతి రాజమాతతో "అమ్మా! నాదు తల్లిదండ్రులను జూచి బహుదినములాయెను. ఇపుడు వారలను జూచునట్టి కోరిక నాకు గలిగియున్నది. కావున నేను విదర్భకు పోవలయును" అనగా నామె బంగారుతోను రత్నములతోను చేయబడిన పల్లకి యొకటి సిద్ధపరచి యందాదమయంతిని గూర్చుండబెట్టి పరివారమును సమకూర్చి యామెతోజేర్చి విదర్భకు బంపెను. అచటచేరి దమయంతి బంధుమిత్ర జనంబులతో కలిసియుండినప్పటికిన్ని నక్షత్రములతో నిండియున్నను చంద్రుడులేనిరాత్రి యెట్లు కాంతిలేకయుండునో యట్లు పతియొక్క వియోగముచేత కాంతిహీనయై వేళకు అన్నము భుజింపక చిక్కినదై మాసినబట్టను కట్టుకొని శరీరసుఖంబుల నేడియు గోరక తన తల్లితో రహస్యముగా తనపతిని వెదకించవలయును, లేనియెడ ప్రాణము విడుచుచున్నాననిచెప్పెను. తల్లియు భీమరాజుతో నీ సమాచారము తెలియపరచెను. అంత నతడు నిపుణులగు బ్రాహ్మణుల

రప్పించి నలుని వెదకుటకై పంపెను. వారితో దమయంతి ప్రత్యేకముగ రాజసభలయందు నీరీతిచెప్పుమని చెప్పి పంపెను.

సీ. సత్యనిత్యుండవు సతినింతివర్జించి
దాని వస్త్రార్ధంబు దఱిగి నీవు
పరిధానముగజేసి పాడియేపోవంగ
భార్యభర్తయు నొగబరగుధర్మ
మదిమిథ్యయయ్యె నీయందు నీకిట్టి ని
ర్దయబుద్ధిచేకొనదగునె యట్టి
సాధ్వికి గరుణాప్రసన్నుండ వగుమని
యెల్లచోబలికిన నెవ్వడేని

ఆ. పలుకుబడగ నోడి ప్రతివచనంబిచ్చు
నతడనలుడు గాగ నతిముదమున
నెఱిగి నన్ను నతని కెఱిగించి తోడ్కొని
రండు రానినాడు రండెఱింగి.

ప్రాణముతో సమానురాలగు భార్యను అడవియందు నిద్రించుచుండగా విడిచిపెట్టి దాని వస్త్రములో సగముచించి కట్టుకొని చెప్పక పోయినట్టి నలునివంటి కఠినహృదయు లెవ్వరైనా కలరాయని యెల్లచోట్లను బలుకుడు. అనగా వారును ప్రతిరాజసభయందు నాలాగుపలికి యుత్తరంబు వడయక మరలివచ్చి విదర్భాపురంబు జేరిరి. అట్లువచ్చినవారలలో పర్ణాదుడను విప్రుండు మాత్రము దమయంతి కిట్లనియె. అమ్మా!

అయోధ్యానాథుండగు ఋతుపర్ణ మహారాజు పరిచారకులలో నొకడు పొట్టివాడు, బాహుకుడని పేరుగలవాడు, వంటచేయుటయందును అశ్వశిక్షయందును అతి సమర్థుడు, నీవు చెప్పినట్టి మాటలను నేను ఋతుపర్ణుని సభలో చెప్పుచుండగా నన్ను రహస్యముగా పిలిచి "పురుషులయందు దైవవశంబున దోషంబులు గల్గిన వాని సహించునేని నయ్యింతి యిహపర లోకములను రెండు లోకంబులందును సౌఖ్యంబు లనుభవించును" అని మఱియేమియు పలుకక యరిగెను. అనగా నతండే నలుడుగానుండవచ్చునని యామె తలచి తన్ను పూర్వము సుబాహుపురంబున కనిపెట్టిన యా సుదేవుని రప్పించి వానితో నిట్లనియె.

బ్రాహ్మణోత్తమా! నీవు మునుపునన్నేలాగు కనిపెట్టి యిచటికి తెచ్చితివో యాలాగే అయోధ్యా నగరంబున కేగి ఋతుపర్ణునొద్ద విదర్భరాజు నలునిగానక రేపు దమయంతీ ద్వితీయ స్వయంవరము సేయదలచి యున్నాడని చెప్పుము అనగా నాతడు అయోధ్యకువెళ్లి ఋతుపర్ణునితో నట్లె చెప్పెను. అంత ఋతుపర్ణుండు బాహుకుని పిలిచి "రేపు దమయంతీ స్వయంవరంబు జరుగుచున్నదట. కావున నే నతి శీఘ్రములో విదర్భకు వెళ్లవలయును. నీవు నేర్చిన యశ్వశిక్ష యను విద్యయొక్క సామర్థ్యమును ఇపుడే చూపవలయు. ఒకదినములోపల నచటికి రథమును తీసుకొని పోవలయును" అని చెప్పగా నలుండు రెండు గుఱ్ఱములను గట్టిన యొక తేరు

సిద్ధపరచి రాజుగారి నెక్కించుకొని వార్ష్ణేయుని వెంటబెట్టుకొని, నది యనియు, పర్వతం బనియు, అరణ్యం బనియు, పట్టణం బనియు, గ్రామం బనియు వృక్షంబనియు వివరమేర్పడకుండునట్లుగా మనోవేగము, వాయువేగము, అన్నట్లు తోలుకొని పోవుచుండెను. ఋతుపర్ణుడు దీనినిజూచి మిక్కిలి యాశ్చర్యపడి యిప్పుడు రథము తోలునట్టి బాహుకుడను వాడు నలుడుగానుండవచ్చునని తోచెడిని. ఏలయనగా నతడుదప్ప మఱియొకడు ఇంత వేగముగా దోలువాడు లేడు. కొన్ని లక్షణంబులచేత నితడు నలునిబోలియున్నవాడు. అయితే యితనికి నీవికార స్వరూపము ఏలకల్గెనో తెలిసినది కాదు. అని యోచించుచుండగా తనపైనుండు వస్త్ర మొకటి క్రింద జాఱిపడెను.

ఋతుపర్ణుడు తక్షణమే బాహుకునిజూచి నా పైవస్త్రము దిగువపడినది. వార్ష్ణేయుడుపోయి దానిని దెచ్చునంతవఱకు రథము తిన్నగా పోనిమ్మనెను. అనవుడు బాహుకుండు "అయ్యా! మీ పైబట్టపడిన చోటికి నిచటికి నొక యోజనంబునకంటె నెక్కువదూరమున్నది. దానిని దెచ్చుట సాధ్యము కానేరదని చెప్పెను. అంతలో నా తేరు అనేక దేశములు, వనములు, గిరి దుర్గంబులు గడచి వచ్చినది.

అప్పుడు ఋతుపర్ణుండు మిక్కిలి దట్టమయిన కొమ్మలచేతను, ఆకులచేతను, పుష్పములచేతను, పండ్లచేతను, నిండినదైనయొక తాండ్రచెట్టును జూచి బాహుకునితో నిట్లనియె.

ఆ. ఎల్లవారు నెఱుగ రెల్లవానిని కన్న
విషయు లెల్లవారు విద్యలందు

దొలగకే నెఱుంగుదును దృష్టిమాత్రన
సకలమైనవస్తు చయముసంఖ్య.

బాహుకుడా! ఈ చెట్టునంగల యాకులు, పువ్వులు, పండ్లు వేత్వేలుగా లెక్కపెట్టి నేను చెప్పెద జూడుమని లెక్కపెట్టి యిన్నిన్నిగలవని చెప్పిన బాహుకుడు రథమునిల్పి యా చెట్టును క్రింద త్రోసి ప్రత్యేక ప్రత్యేకముగ లెక్కపెట్టగా నట్లేయుండెను. బాహుకుడు ఆశ్చర్యపడి యీవిద్య నాకుపదేశింపవలయునని యడిగిన ఋతుపర్ణుండిట్లనియె.

క. ఇది యక్షహృదయ మనగా
విదితంబగు విద్యదీని విధ్యుక్తముగా
మదినెఱుగునరుడు సంఖ్యా
విదుడగు దుష్కృతకళంక విషముక్తుడగుః

ఇది యక్షహృదయమనువిద్య. దీని నెఱిగినదాని చేతనే యెవడుగాని సంఖ్యాజ్ఞానము తెలిసినవాడై పాపము వలనను నిందవలనను విషమువలనను విడువబడినవాడగునని యావిద్య నతనికి నుపదేశించెను.

అంత నావిద్యయొక్క మహిమచేత బాహుకుడైన నలునియందు ప్రవేశించియున్న కలిపురుషుడు విషము గ్రక్కుచు నాతని శరీరమునుండి బయలువెడలి యతని మన్ననగైకొని వెళ్లిపోయెను. తర్వాత ఋతుపర్ణుడు, వార్ష్ణేయుడు, నలుడు వీరు ముగ్వురును రథంబెక్కి విదర్భకుం జనిరి.

దమయంతి యారథధ్వని వినియిది నలుని రథముగా నుండ వచ్చునని తలచి యానందించి కేశినియను చెలికత్తెను పిలిచి

"ఓయింతీ! రథమునందు వచ్చువారలలో ఋతుపర్ణుడు అయోధ్యారాజనియు వార్ష్ణేయుడు సారధి యనియును వింటెని. బాహుకుండను వాడెవ్వడో తెలియలేదు. వాని వృత్తాంతమును సవిస్తారముగ నెఱిగి రమ్మ" న నా కేశిని బాహుకుని యొద్దకు పోయి దమయంతి నీక్షేమంబడిగిరమ్మని నన్ను బంపెను. నీవెవ్వడవు? ఇందుల కేమి కారణంబున వచ్చితి వన దానికిబాహుకుండిట్లనియె.

అమ్మా! నేను ఋతుపర్ణమహారాజుగారి రథము తోలువాడను. ఆయన యొక్క దినంబులో విదర్భాపురంబునకు బోవలయునన నయోధ్యనుండి బయలువెడలి నూఱు ఆమడలు త్రోవనడిపి యిచటికి వచ్చితిని. అదివిని కేశిని మరల నిట్లనియె. అమ్మా! అడవిలో నిద్రబోవుచున్న దమయంతిని బాసి దాని చీరలో సగముగోసి కట్టుకొని నలుడు ఎటకో పోయెను. అదిమొదలు ఆమె యామలిన వస్త్రమునే కట్టుకొని భూమిని పడకగాజేసికొని యున్నది. అని యిట్లు చెప్పుచుండగా నతడు కన్నీరు మున్నీరై పాఱ నేడవసాగెను. అంత కేశిని దమయంతియొద్దకుబోయి యీ తెఱం గెఱింగించగా నామె కేశినితో నలుడు ఋతుపర్ణునియొద్ద వంటచేయుచుండెనని కూడ వింటిని. ఆవిషయంబెఱింగిరమ్మని యింకొకతూరి యా చెలికత్తెను బంపెను. అదియు నలునికడకేతెంచి దమయంతితో నిట్లనియె.

సీ. వినవమ్మ తృణముష్టి గొనివాడు వీచిన
నందగ్ని యుదయించి యందువంట

లమరు నంతకు నింధనము లపేక్షింపక
యుఱుగక మండుచునుండు మఱియు
గడకతోనంజుళ్లు గడుగంగ సమకట్టి
జలమపేక్షించుడు సంభవిల్లి
కుంభములు నిండి దివ్యాంభః ప్రవాహము
క్షయమగుచుండు నా క్షణమచూడ
ఆ. నతని కరతల ద్వయావ మర్దితములై
కందియును మహా సుగంధకుసుమ
తతులు గ్రొంటెయట్ల తమకంపు విడువక
యుండు నతని తేజ మున్నతంబు.

అతని చరిత్రంబు మిక్కిలి యద్భుతము. అతనిని దైవమనియే చెప్పవలెయును. అతడు వంటచేయునపుడు నిప్పు తెచ్చుకొనుట లేదట. కట్టెలు అపేక్షించుట లేదట. పిడికెడు గడ్డిని చేతబట్టి ఒకసారి విసరినట్లయితే అవి మండుచు వంట పూర్తియగునంతవఱకు మండుచుండునట. జలముకోరిన మాత్రాన పాత్రంబులు నీటితో నిండియుండునట. పుష్పములు అతని చేతులతో చక్కగా నలపబడినప్పటికిని వాడిపోవట. మఱి వాసన చెడదట. అనగా నద్దమయంతి యాతడు వండిన వంటకమును దెప్పించి దానిని రుచిచూచి తప్పక యాతండు నలుడని నిశ్చయించి తనతండ్రికి తెలియపరచి వానిని రప్పించిన వానితో నామె ‹‹ మనుష్య సంచారము లేని వనమందు నిదురించుచున్న దానిని, అగ్ని దేవతయెదుట వివాహంబాడిన దానిని, దేవతలనుగూడ వదలి నలుని వరించిన దానిని, పుత్ర

వతినైయున్న దానిని, పతియే గతియని భావించియున్న దానిని, పతివ్రతయై యున్న దానిని కొంచెమైనను కనికరము లేక యుండగా నలుని వలె విడిచిపెట్టినవారు ఈలోకమునందెవ్వరు లేరుగదా!" అనగా నతడు కన్నీరు చొటచొటం గార నేడ్చుచుండెను. అపుడు సమస్తజంతువులకు ప్రాణభూతుండయి యంతర్యామియగు వాయుదేవుండు ఎల్లవారును వినునట్లుగా నాకసంబుననుండి నలునితో నిట్లనియె.

‹‹ ఓ నిషధేశ్వరా! పరమ పతివ్రతయగు నీ దమయంతిని సూర్యుడు, చంద్రుడు, నేనును మూడు సంవత్సరంబులు గాపాడుచుంటిమి. ఈమె స్వప్నమునందైనను అన్యులను దలచినది కాదు. ఈమె చరిత్రము నిర్దోషమైనది. నిప్పులకు చెదలు పట్టునే? అలాగు ఈమె పరిశుద్ధమైన నడవడిగల స్త్రీ. కావున నీవు సంశయింప నక్కఱలేదు. కైకొనుము" అని చెప్పినతోడనే దేవతలు సువాసనగల పారిజాత పుష్పవర్షంబుల కురిసిరి. సురదుందుభినాదములు మ్రోసినవి. భూజనంబులెల్ల నద్దమయంతి సుశీలంబున కాశ్చర్యపడి పలుతెఱంగుల నుతింపసాగిరి. అంత నలుడు మిక్కిలి యానందమును బొందినవాడై కర్కోటకుని తలంచెను. వెంటనే యతడు నలుని పైబట్టను తెచ్చియిచ్చెను. దానిని నలుడు ధరించి పూర్వము యున్న విధముగ నిజరూపమును దాల్చెను.

పిదప నయ్యిరువురు అన్యోన్యప్రేమగలవారై వెలుంగుచుండ భీమరాజు సంతోషించి తన దేశంబునం గల దేవాలయంబులందు విశేషపూజలు సేయించి యక్కడక్కడ నుత్స

వంబులుగావించెను. అట్టి మహోత్సవం బెఱింగి ఋతుపర్ణుడు నలునొద్దకువచ్చి నలమహారాజా! «నీవు నిఖిలలోకపూజ్యుండవైన చక్రవర్తివి. నిన్నెఱుంగక నీచకార్యంబుల యందు నియోగించితిని. నన్ను మన్నింపుము" అని యాతనికి వందనం బాచరించి ఆయనచే నశ్వహృదయంబను విద్యనుపదేశముగొని యయోధ్యకుం జనియె. అంత నలుడు ఒక రథం బెక్కి పదియాఱేనుగులతోను, ఏబది గుఱ్ఱంబులతోను, ఆఱునూఱు కాల్బలంబులతోను నిజనివాసంబైన నిషధదేశమునకుపోయి పుష్కరునితో మరల జూదమాడి యాతని నోడించి యఖిల మహీరాజ్యంబును జయించి లక్ష్మీదేవివలె ప్రకాశించుచున్న దమయంతిని పూర్ణచంద్రునివలె పెరుగుచున్న తన బిడ్డలను రప్పించుకొని యెప్పటి యట్ల సుఖంబుగ రాజ్యమేలుచుండెను.

సీ. ఈ సతిమణి కథ నెప్పుడు దత్తావ
　　ధానులై వినువారు దవిలిభక్తి
జదివెడువారును జగదీశకలిదోష
　　నిర్ముక్తులగుదురు నిఖిలపుణ్య
ఫలభాగులగుదురు బహుపుత్రపౌత్రాయు
　　రారోగ్య ధనయుక్తు లగుదురెల్ల
విషములకును దుష్టవిషయంబులకు దూరు
　　లగదురు ధర్మాత్ములగుదు రుర్వి
ఆ. గడు ప్రసిద్ధనిందియు గర్కోటకుని దమ
యంతి పుణ్యమూర్తి యైననలుని


నుత చరిత్రుడైన ఋతుపర్ణు గీర్తింప
గలి భయంబు లెల్లదొలగుచుండు.

—•०•—

శ్లో. కర్కోటకస్యనాగస్య దమయంత్యానలస్యచ
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనం.

కర్కోటకుని, దమయంతిని, నలుని, ఋతుపర్ణుని నీ కలికాలమునందు ఎవరు స్మరించుచున్నారో అట్టివారు సకల దుఃఖములవలన విముక్తులయి సుఖముగానుందురు.

స్వస్తి స్తు.



END OF
TITLE